క్లుప్తంగా

ఓటరు జాబితాపై సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో రమేశ్‌బాబు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో రమేశ్‌బాబు సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండినవారు ఈ నెల 28 వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో సవరణలు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, టీడీపీ నాయకులు కామని రాజేశం తదితరులున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ దేవి

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం ప్రణీధి ఫౌండేషన్, కోహెడ సాయికృష్ణ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 200 మంది పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రముఖ గైనకాలజిస్టు దేవి, ఎండీ సీహెచ్ దయాకర్ వివిధ పరీక్షలు చేసి సలహాలు సూచనలు ఇచ్చారు. మందులు సక్రమంగా వాడుకోవాలని సూచించారు. కనగండ్ల సతీశ్‌కుమార్, ఒకేషనల్ విద్యార్థులు సహాయ సహకారాలు అందించారు. మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, కాంట్రాక్టర్ కిరణ్‌కుమార్, నరేదర్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, కొంరయ్య, కనుకయ్య, తిరుపతి, వంశీకృష్ణ, ప్రశాంత్, రాణాప్రతాప్ సింగ్, నవీన్, ఉమేశ్, సుమిత్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గన్నేరువరం: చీమలకుంటపల్లె ఎస్సీ కాలనీల్లో సీసీరోడ్డు నిర్మించాలని కోరుతూ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బామండ్ల రవీందర్, జిల్లా కార్యదర్శి మాశం ఆంజనేయుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. వానాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ముతో ఇబ్బంది పడుతున్నామని, సీసీరోడ్డు నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బామండ్ల ఆంజనేయులు, రమేశ్, అనిల్, నర్సయ్య, రమేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన



భూములు, రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రైతులకు పరిహారంపై గురువారం హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు భూములు పరిశీలించారు. గ్రామానికి చెందిన 15మంది రైతులు పరిహారం రాకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. రోడ్డు నిర్మాణంలో పోతున్న భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు పరిహారం అందించేందుకు సర్వే చేయించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ భాస్కర్, ఆర్‌ఐ బాలకిషన్ రైతులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డైరెక్టర్లు సమ్మిరెడ్డి, గూటం సమ్మిరెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి ప్రారంభించారు. రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, సాయిలు, సంపత్, కొంరయ్య రైతులు ఉన్నారు.

పెన్షన్ ఇవ్వాలి

సైదాపూర్: కురుమల కులదైవం శ్రీబీరప్పస్వామి పూజారులకు (వృత్తి కళాకారులకు) ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలని బీరప్పస్వామి పూజారుల సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అమరగొండ లింగమూర్తి గురువారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాభై ఏళ్లు నిండగానే నెలకు రూ.ఐదువేలు మంజూరు చేయాలని కోరారు. పూజారులుగా సైదాపూర్, చొప్పదండి, ఇల్లందకుంట, మండలాల్లోని అమరగొండ, బండారి, దంసాని వంశస్తులు కొనసాగుతున్నారని, ప్రభుత్వం పెన్షన్, రూ.10 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్

జమ్మికుంట: మత్తు పదార్థాలకు యువత బానిసకావొద్దని, విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని జమ్మికుంట ఎక్సైజ్ సీఐ మాధవిలత అన్నారు. పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో గురువారం మదాకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సౌమ్య, కళాశాల అధ్యాపకులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ టీం, సోషల్ వర్కర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల, మండలంలోని రాంపూర్ గ్రామంలోని



జమ్మికుంట: మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మాధవిలత

జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మత్తు, మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వినోద్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ముకుందరెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులున్నారు.

గుండ్ల చెరువు అభివృద్ధికి పాటుపడాలి

జమ్మికుంట: గుండ్ల చెరువు అభివృద్ధికి పాటుపడకుండా చేపల పంపిణీ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గొడవ పడడం సిగ్గుచేటని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అన్నారు. గురువారం అబాది జమ్మికుంట గుండ్ల చెరువును సందర్శించిన అనంతరం మాట్లాడారు. చెరువు మత్తడికి గండిపడి ఆరునెలలు అవుతుందని, రైతులు, అబాది జమ్మికుంట, జగ్గయ్యపల్లె గ్రామ ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడుతుంటే నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని చెరువుకు చిన్న గండి పూడ్చ లేనివారు రాజకీయాలు మానుకోవాలని లేదంటే ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఠాగూర్ రాజేశ్, కొమ్ము అశోక్, బచ్చు శివన్న, గణేష్, ఇటికాల స్వరూప, తూడి రవిచంద్రారెడ్డి, రాము, రాచపల్లి ప్రశాంత్, రామస్వామి, పోడేటి అనిల్, దార కృష్ణ, వెంకటేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

గన్నేరువరం: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ వివిధ రకాల చట్టాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్యానల్ అడ్వకేట్ సదానందం, ఇన్‌చార్జి హెచ్‌ఎం అంజయ్య,టీచర్లు పాల్గొన్నారు.

నీటి శుద్ధీకరణ యంత్రం బహూకరణ



యంత్రాన్ని బహూకరిస్తున్న మంత్రి పొన్నం

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన విద్యాకమిటీ మాజీ చైర్మన్ మార్క రాజ్‌కుమార్ దాదాపు రూ.20 వేల విలువ గల నీటిశుద్ధీకరణ యంత్రాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బహూకరించారు. గురువారం హుస్నాబాద్ మంత్రి క్యాంపు కార్యాలయంలో నీటి శుద్ధీకరణ యంత్రాన్ని హెచ్‌ఎం కిషన్ నాయక్‌కు అందించిన అనంతరం రాజ్‌కుమార్‌ను మంత్రి పొన్నం అభినందించారు. కార్యక్రమంలో టీచర్లు ఎండీ ఖదీర్‌పాషా, సునీత, బుర్ర తిరుపతి, బింగి రాజేంద్రప్రసాద్ గ్రామస్తులున్నారు.

సంక్షిప్త వార్తలు

● **నాయకుల వ్యాఖ్యలు ఖండిస్తున్నాం**

జమ్మికుంట: పట్టణంలోని గుండ్ల చెరువులో చేపపిల్లల విడుదలలో కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పర్లపల్లి రమేశ్ ఖండించారు. చేపలు ఆలస్యంగా పంపిణీ చేస్తే ఎదగవని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులో లక్ష పిల్లలు విడుదలచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం యాభైవేల పిల్లలు పంపిణీ చేసిందని, మత్స్యకారులకు లాభం ఉండదని, నష్టపోతారని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడితే వొడితెల ప్రణవ్, పత్తి కృష్ణారెడ్డి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని లేదంటే నియోజకవర్గంలో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

● **నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలి**

గన్నేరువరం: రేషన్ షాపుల్లో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆహార భద్రత పథకంలో అందించే వివరాలను పట్టికలో పొందుపరచాలని రాష్ట్ర ఆహార భద్రత కమిటీ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. మండలంలోని గునుకులకొండాపూర్ రేషన్‌షాపు, జంగపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సరుకుల పంపిణీపై బాలింతలతో మాట్లాడారు.

● **అభివృద్ధిని పట్టించుకోవడంలేదు**

హుజూరాబాద్‌రూరల్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దళితులను మోసం చేశాడని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారిస్తే భూకబ్జాలకు వంతపాడుతూ, రాజకీయపబ్బం గడుపుతున్నాడని ఎద్దేవా చేశారు. దళితుల ఓట్లు దండుకొని వారి అభివృద్ధిని పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమానికి తేడా తెలియకుండా ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

● **దళితబంధు పేరిట దగా**

హుజూరాబాద్‌రూరల్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పేరిట దగా చేసి నిధులు ఫ్రీజింగ్ చేసిందని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ అన్నారు. గురువారం మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే రెండో విడత నిధులు వస్తాయని కౌశిక్‌రెడ్డి మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని, దళితులకు ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి, గెలిచాక ముఖం చాటేశారని, నియోజకవర్గంలోని సమస్యలను గాలికొదిలి కేసీఆర్, కేటీఆర్ మెప్పు పొందేందుకు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

● **నిధులు మంజూరు**

హుజూరాబాద్‌రూరల్: పట్టణ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చామని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. వాకింగ్ ట్రాక్‌కు నిధులు మంజూరు చేయించినందుకు వాకర్స్ గురువారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రూ.10 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారని, నిధులతో వాకింగ్ ట్రాక్, గేటు ఏర్పాటు చేయడం హర్షనీయమని తెలిపారు.

● **రైతులు సహకరిస్తేనే సాగునీరు**

చిగురుమామిడి: గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టు కాల్వల తవ్వకం పనులకు రైతులు సహకరిస్తేనే త్వరలో సాగునీరు అందుతుందని భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్ అన్నారు. మండలంలోని బొమ్మనపల్లి, సుందరగిరి, ఇందుర్తి గ్రామాల్లో గురువారం భూనిర్వాసితులతో గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయం మే రకు పరిహారం అందుతుందని, అవసరమైతే మరో సారి అధికారులు మోఖాపై సర్వే చేస్తామన్నారు.

● **గంగిపల్లిని సందర్శించిన ట్రైనీ కలెక్టర్**

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామాన్ని ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ గురువారం సందర్శించారు. గాలికుంటు నివారణ టీకాలు, జాతీయ పశుగణన కార్యక్రమ పనితీరును పరిశీలించారు. పశుగణనలో ఎదురయ్యే సమస్యలను పశువైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు, వైద్యాధికారులు అజయ్‌యాదవ్‌ను శాలువాతో సన్మానించారు.

● **ఎఫ్‌పీవో కార్యవర్గం**

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రూపిరెడ్డి స్కైలాబ్ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఉప్పు నిఖిత, డైరెక్టర్లుగా వెల్మ రఘుపతిరెడ్డి, బీసవేని రాజశేఖర్, కోలపురి హన్మంతు, కడారి కొముదయ్య, లింగాల గంగరాణి, కొత్తూరి మంజుల, ఉదారం మమత, దండవేని జమున, మండల స్వరూప, పడిశెట్టి సంధ్యారాణిలు నియామకమయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను రైతులు అభినందించారు. అంతకుముందు గత పాలకవర్గ ఆదాయ వ్యయాలను చర్చించారు.

● **కార్మిక సంక్షేమమే ధ్యేయం**

జమ్మికుంట: కార్మిక సంక్షేమమే ధ్యేయంగా మజ్దూర్ యూనియన్ పనిచేస్తుందని డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ అన్నారు. భారతీయ రైల్వే గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల నేపథ్యంలో గురువారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. రైల్వే ఉద్యోగులకు బోనస్ మజ్దూర్ యూనియన్ సాధించిందని, కార్మిక పక్షపాత విధానాల కోసం పోరాటం చేస్తున్న ఎస్‌సీఆర్‌ఎంయూ జెండా గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

● **హుండీ ఆదాయం లెక్కింపు**

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. రూ.2,42, 389 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో మారుతి తెలిపారు.

● **కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం**

వీణవంక: అరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాసర్ల సుధాకర్ అన్నారు. కొండపాక గ్రామంలో మాట్లాడారు. కోతలు పూర్తి కావస్తున్నా ధాన్యం తూకం వేయడం లేదని, రైతులు గత్యంతరం లేక దళారులకు విక్రయించి నష్టపోతున్నారని వాపోయారు. కల్లాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, త్వరగా కొనుగోళ్లు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

● **మరుగుదొడ్ల డోర్లు ధ్వంసం**

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరుగుదొడ్ల డోర్లు, నల్లాలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. హెచ్‌ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయుడు చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం... గురువారం పాఠశాల వచ్చిన తర్వాత సంఘటనను గుర్తించామన్నారు. పాఠశాలలో రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, చర్యలు తీసుకోవాలని పోలీసులకు సమాచారం అందించామన్నారు. అంతేకాకుండా పాఠశాల పరిసరాలపై నిఘా ఏర్పాటు చేయాలని, గ్రామస్తులు దృష్టి సారించాలని కోరారు.

● **బాలింత ఇంటికి డాక్టర్**

శంకరపట్నం: బాలింతలను 42 రోజుల పాటు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని కన్నాపూర్ గ్రామంలో డాక్టర్ శ్వేత బాలింత ఇంటికి వెళ్లి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షించామని వైద్యాధికారి శ్రావణ్ తెలిపారు.

● **ఎమ్మెల్యే పరామర్శ**

గంగాధర: రామడుగు సాక్షి విలేకరి రాజిరెడ్డి కుటుంబాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. రాజిరెడ్డి తల్లి సుగుణమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● **రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

ఇల్లందకుంట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని భోగంపాడు గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. భోగంపాడుకు చెందిన జిల్లెల మల్లారెడ్డి మర్రివానిపల్లి నుంచి స్కూటీపై స్వగ్రామం వెళ్తుండగా సీతంపేటకు చెందిన చిలుక అజయ్ బైక్‌తో స్కూటీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో మల్లారెడ్డి తీవ్రంగా గాయపడగా స్థానికులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి కుమారుడు రామిరెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

● **ఇసుక లారీల అడ్డగింత**

మానకొండూర్: మండలంలోని ఊటూరులో ఇసుక లారీలను గురువారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలోని ఇసుక రీచ్ నుంచి అధిక లోడుతో ఇసుక తరలిస్తున్నారని, ప్రభుత్వా ఆదాయానికి గండి పడుతుందని, రోడ్లు ధ్వంసమవుతున్నాయని, లారీలో వెళ్లే సమయంలో దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నామని మండిపడ్డారు. సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడం లేదని వాపోయారు.



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో నివాస గృహాల నుంచి వస్తున్న మురుగునీరు ఖాళీ స్థలంలో నిలుస్తోంది. ఫలితంగా దోమలు వృద్ధి చెందడంతోపాటు దుర్వాసన వెలువడుతుందని రోగాల బారినపడతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
టి. సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్, సెల్ నంబర్ 9989930709

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, కబడ్డీ పోటీలకు విద్యార్థులు



జమ్మికుంట: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వైష్ణవి, లౌక్యశ్రీ కరీంనగర్‌లో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి, ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ పీడీ శ్రీను గురువారం తెలిపారు. ఈసందర్భంగా హెచ్‌ఎం సమ్మయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బండారి రజిత, టీచర్లు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ హై స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు జి.సుశాంత్, ఈ.శశివర్ధన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని గురువారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం,



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు తాడికల్ విద్యార్థి

శంకరపట్నం: మండలంలోని తాడికల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పావురాల అభిలాశ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపూర్‌లో జరుగుతున్న అండర్-14 విభాగంలో పాల్గొంటాడని పేర్కొన్నారు. అభిలాశ్‌ను ఎంఈవో లక్ష్మీనారాయణ, టీచర్లు అభినందించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్, తదితరులు

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలోని ఓపెన్ స్థలంచుట్టూ ప్రహరీ నిర్మాణానికి కౌన్సిలర్ నరేశ్ ఆధ్వర్యంలో గురువారం భూమిపూజ చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, కమిషనర్ ఎండీ అయాజ్‌కు కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుంకరి రమేష్, సాయిని రవి, వార్డు ప్రజలు మల్లికార్జున్, సాంబశివరెడ్డి, కొముదయ్య, తూడి రవిచందర్‌రెడ్డి, కోమురరెడ్డి, కుమార్, రత్నాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులకు..

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయం వద్ద సుడా నిధులతో చేపట్టే సెంట్రల్ లైటింగ్ పనులకు నాయకులు గురువారం భూమిపూజ చేశారు. సుడా పరిధిలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు చేస్తున్నామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, మాజీ ఉప సర్పంచ్‌లు బద్దం సంపత్‌రెడ్డి, మల్లారెడ్డి, గ్రామ అధ్యక్షుడు బొజ్జ తిరుపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పర్తి పరిపూర్ణాచారి, నాయకులు సందవేని ఐలయ్య, ముస్కు కరుణాకర్‌రెడ్డి, దుడ్డు మల్లేశం, కొముదయ్య, ఎల్లయ్య, మల్లేశం పాల్గొన్నారు.

రైతుల ఆందోళన



ధాన్యం వ్యాన్ ఎదుట నిల్చొన్న రైతులు

జమ్మికుంట: పంట దిగుబడి రాకపోతే పరిహారం అందిస్తామని అగ్రిమెంట్ చేసుకొని ఇవ్వకుండా తిరుగుతున్న ఆర్గనైజర్ వ్యాన్‌ను రైతులు అడ్డుకున్నారు. మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన 12 మంది రైతులతో వానాకాలంలో 22 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయించారు. దిగుబడి వస్తే క్వింటాల్‌కు రూ.3,000 చొప్పున తీసుకుంటామని, లేదంటే ఎకరాకు రూ.యాభైవేల కాంపోజిషన్ చెల్లిస్తామని వీణవంక మండలం లస్మక్కపల్లి గ్రామానికి చెందిన ఓ సీడ్ ఆర్గనైజర్ ఒప్పంద పత్రం రాసిచ్చాడు. ఈ క్రమంలో పంట దిగుబడి రాకపోవడంతో రైతులు కంపోజిషన్ చెల్లించాలనడంతో దాటవేస్తూ వచ్చాడు. గురువారం వరి ధాన్యం కొనుగోలు చేసి వెంకటేశ్వరపల్లి గ్రామం నుంచి తరలిస్తుండగా పరిహారం చెల్లించే వరకు వ్యాన్‌ను కదలివ్వమని వెంకటేశ్వరపల్లి గ్రామం వద్ద రైతులు ఆందోళన చేశారు. జమ్మికుంట బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీడ్ ఆర్గనైజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని నాలుగో వార్డులో సుమారు రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను కౌన్సిలర్ తిరుమల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ ముత్యంరాజు, బీఆర్ఎస్ నాయకుడు గందె శ్రీనివాస్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

హుజూరాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా తీసుకోవాలని యువశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగాల అశోక్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని కేసీ క్యాంపులో నెహ్రూ యువశక్తి యూత్ అసోసియేషన్ రాజపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో ఏక్ పేడ్ మాకే నామ్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు మొక్కలు నాటారు. విద్యార్థులు తల్లిపేరు మీద మొక్కలు నాటడం కార్యక్రమం ఉద్దేశమన్నారు. సీనియర్ డేమాన్ స్టేటర్, సెంటర్ ఎడ్ల ఆదామ్‌పాల్గొన్నారు.

గన్నేరువరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తహసీల్దార్ ఇప్ప నరేందర్



కేసీ క్యాంపులో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

అన్నారు. నెహ్రూ యువకేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఆర్‌ఐ రజినీకాంత్‌రెడ్డి, యువ చైతన్య యూత్ క్లబ్ సభ్యులు అనిల్, బాబు, రజినీకాంత్ పాల్గొన్నారు.

కొత్తవి బియ్యానికి...పాతవి ధాన్యానికి

శంకరపట్నం: కొనుగోళ్ల కేంద్రాలకు వచ్చిన కొత్త గన్నీసంచులను రైస్‌మిల్లుల్లో బియ్యం కోసం తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా



ధాన్యం తూకం వేస్తూ మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం కొత్త గన్నీ సంచులను సరాఫరా చేయగా గురువారం మిల్లర్లకు ట్రాక్టర్‌లో సరఫరా చేస్తుండటంతో లింగాపూర్‌లో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్‌సీఐకి మిల్లర్లు బియ్యం సరాఫరా చేస్తామనడంతోనే కొత్త గన్నీ సంచులు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పంపించామని మెట్‌పల్లి సీఈవో సదయ్య తెలిపారు. పాత సంచుల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వివరించారు.